
సాక్షి ఒడిశా

శనివారం । 7 । అక్టోబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు
నగదు రూ.2,97,616
బంగారం 3 గ్రాముల 600 మిల్లీ గ్రాములు
వెండి 22 గ్రాముల 700 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



నిఘా చర్యలపై అవగాహన అవసరం
- 8లో



ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష
- 8లో

న్యూస్‌రీల్

సైబర్ అవగాహన శిబిరం రేపు



సమావేశంలో పాల్గొన్న అధికారులు

జయపురం: స్థానిక మున్సిపల్ సభాగృహంలో సైబర్ అవగాహన సన్నాహక సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ డివిజనల్ పోలీసు అధికారి హరీష్ బీసీ మాట్లాడుతూ.. ఈనెల 8వ తేదీన జయపురం ప్రజలకు సైబర్ క్రైమ్స్‌పై అవగాహన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు. సైబర్ నేరగాళ్ల నుంచి ఎలా రక్షణ పొందాలి అనే విషయాన్ని తెలియజేయడం జరుగుతుందన్నారు. సైబర్ బాధితులు టోల్ ఫ్రీ నంబర్ 1930ను వెంటనే సంప్రదించాలని సూచించారు. ఓటీపీలు, బ్యాంక్ అకౌంట్ వివరాలు ఎవరికీ తెలియజేయడం సురక్షితం కాదని హెచ్చరించారు. అవగహన శిబిరంలో భాగంగా నగరంలో మారథాన్, బైక్ ర్యాలీతో పాటు మధ్యాహ్నం సాంస్కృతి ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా వీధి నాటకాన్ని ప్రదర్శించాలని నిర్ణయించారు. సమావేశంలో జయపురం బీడీవో రాజీవ్ దాస్, తహసీల్దార్ సుశ్రీ సాగరిక షాడంగి, మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్, సబ్ రిజిస్ట్రార్ నీలాంబర పూజారి, పట్టణ పోలీసు అధికారి సత్యానంద పాత్రో, సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్న అధికారులు

రాయగడ: జిల్లాలోని చంద్రపూర్ సమితి తొలియాపాదొరా, డొంగసొరాడ, మాదాపదొరా ప్రాంతాల్లో ఉన్నటువంటి నదుల నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఆరు ట్రాక్టర్లను తహసీల్దార్ సొరజ్ నాయక్ బెహర, ఆర్ఐ అనంత శేఖర్‌లు పట్టుకున్నారు. ఇసుక అక్రమంగా రవాణా అవుతుందని సమాచారం తెలుసుకున్న అధికారులు గురువారం రాత్రి ఆకస్మిక దాడులను నిర్వహించారు. ఈ దాడుల్లో ఇసుకతో ట్రాక్టర్లను పట్టుకున్న అధికారులు రూ.56,500ల జరిమానా విధించారు.

87 కిలోల గంజాయి పట్టివేత



బరంపురం: గంజాయి బస్తాలతో అరెస్టు చేసిన వ్యక్తిని చూపిస్తున్న పోలీసులు

బరంపురం: గంజాం–గజపతి జిల్లాల సరిహద్దు తప్పపాని ఘాట్ రోడ్డు నుంచి బరంపురం నగరం వైపు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. బరంపురం ఎక్సైజ్ విభాగం అధికారి రామచంద్ర మహంతి తెలిపిన వివరాల మేరకు.. గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి నుంచి బరంపురం మీదుగా బీహార్‌కి వెళ్తున్న వ్యాన్‌లో గంజాయి రవాణా అవుతున్నట్లు ముందస్తు సమాచారం వచ్చింది. దీంతో తప్పపాని ఘాట్ రోడ్డులో అధికారులు సోదాలు నిర్వహించారు. ఆ సమయంలో అతివేగంగా వస్తున్న వ్యాన్‌లో తనిఖీలు నిర్వహించగా ప్లాస్టిక్ బస్తాల్లో అక్రమంగా తరలిస్తున్న గంజాయి బస్తాలు సీజ్ చేసి, ఒకరిని అరెస్టు చేశారు. సీజ్ చేసిన బస్తాల్లో 87 కిలోల గంజాయి విలువ సుమారు రూ.14 లక్షలు ఉంటుందని వివరించారు.

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి బెజంగివాడ పంచాయతీ బౌహరిగూడ గ్రామం వద్ద ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం ఉదయం పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో గ్రామ సమీపంలోని అడవి దగ్గర ఇద్దరు వ్యక్తులు బస్తాలతో ఉండడం గమనించి, వారి వద్దకు వెళ్లి తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకొని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. గంజాయిని తూకం వేయగా రెండు క్వింటాళ్లు ఉంది. దీని విలువ సుమారు రూ.20 లక్షలు ఉంటుందని పోలీసులు వివరించారు. నిందితులిద్దరూ బౌహరిగుడ గ్రామానికి చెందిన భద్ర లలిత్, చైతన్యగౌడ్‌లుగా గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.



మల్కన్‌గిరి: గంజాయితో పట్టుబడిన నిందితులను చూపిస్తున్న పోలీసులు

• శరన్నవరాత్రులకు ముస్తాబు



బేజిజపూర్‌లో సిద్ధమైన దుర్గా పండాల్

దేవీ శరన్నవరాత్రులకు నగరంలోని వివిధ కూడళ్లలో వేదికలు సిద్ధమవుతున్నాయి. ఈనెల 15వ తేదీ నుంచి ఉత్సవాలు ప్రారంభమవ్వనున్న నేపథ్యంలో కొమ్మపల్లి, స్టేషన్ రోడ్, గిరి మార్కెట్, గిరిజా జంక్షన్, హనుమాన్ బజార్, భేజిజపూర్, గుసానినువాగం తదితర ప్రాంతాల్లో పూజా కమిటీల ఆధ్వర్యంలో భారీ దుర్గా పండాల్‌లు ఏర్పాటవుతున్నాయి. ఉత్సవాల సమయంలో శాంతి భద్రతలు పర్యవేక్షించేందుకు బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్ ఆదేశంతో పోలీసులు సమయత్తమవుతున్నారు. ముఖ్యంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆయా స్టేషన్ల ఐఐసీ అధికారులు తెలియజేశారు. - బరంపురం



పాత బస్టాండ్‌లో సిద్ధమవుతున్న వేదిక



హనుమాన్ జంక్షన్‌లో రూపుదిద్దుకుంటున్న అమ్మవారి విగ్రహం

మొబైల్ టవర్ల ఏర్పాటు అత్యవసరం

- నక్సల్స్ ప్రభావం అరికట్టడంతో ఒడిశా ముందంజ
- ఎల్‌డబ్ల్యూఈ సమావేశంలో మంత్రి విక్రమ కేశరి అరూఖ్



సదస్సులో పాల్గొన్న రాష్ట్ర డీజీపీ సునీల్ కుమార్ బన్సాల్, ఆర్థిక శాఖ మంత్రి విక్రమ కేశరి అరూఖ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా

భువనేశ్వర్: రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాద (ఎల్‌డబ్ల్యూఈ) ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన మొబైల్ టవర్లను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రతినిధులు డిమాండ్ చేశారు. న్యూఢిల్లీలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన వామపక్ష తీవ్రవాదం (ఎల్‌డబ్ల్యూఈ)పై జాతీయ స్థాయి సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. రాష్ట్రం నుంచి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రతినిధిగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి విక్రమ కేశరి అరూఖ్ ప్రాతినిధ్యం వహించారు. ఆయనతో పాటు రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు సునీల్ కుమార్ బన్సాల్ మరియు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా హాజరయ్యారు. ఈ సందర్భంగా అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు భద్రతా బలగాలు, పోలీసులు, అధికారులు మొదలైన వారి సత్వర కదలిక కోసం ప్రత్యేక హెలికాప్టర్ కావాలని ఈ వర్గం డిమాండ్ చేసింది.

అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలి

రాష్ట్రంలోని 10 మావోయిస్టు ప్రభావిత జిల్లాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. టెలీ కమ్యూనికేషన్ సౌకర్యాల కొరత కారణంగా ప్రజలు చాలా అసౌకర్యాలను ఎదుర్కొంటున్నందున ఈ ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన మొబైల్ టవర్లను ఏర్పాటు చేయాలనేది ప్రధాన డిమాండ్‌గా అభ్యర్థించినట్లు విక్రమ కేశరి అరూఖ్ తెలిపారు. రాష్ట్రంలో ఇప్పుడు పది జిల్లాలకే మావోల ప్రభావం పరిమితమైనట్లు వెల్లడించారు. హింస తీవ్రత తగ్గుముఖం పట్టిందన్నారు. సామూహిక మద్దతు స్థావరం మరియు స్థానిక కేడర్‌ల నియామకం కూడా తగ్గుముఖం పట్టిందని తెలియజేయడం విశేషం. నక్సల్స్ బెడదను అరికట్టడంలో ఒడిశా మెరుగ్గా ఉందన్నారు.

గతంలో 21 జిల్లాల్లో ప్రభావితం

గతంలో ఒడిశాలో దాదాపు 21 జిల్లాల్లో నక్సల్స్ ప్రభావం ఉండేదన్నారు. కానీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సకాలంలో తీసుకున్న చర్యల వల్ల నేడు ఈ తీవ్రత 10 జిల్లాలకు పరిమితమయ్యిందన్నారు. ప్రభుత్వ అనుకూలమైన అభివృద్ధి కార్యక్రమాలు మరియు ప్రజల భాగస్వామ్యంతో ప్రజాహిత పథకాలు అమలు, కార్యాచరణ ఈ సాఫల్యతకు ప్రేరణగా పేర్కొన్నారు. దశాబ్దాలుగా మావోయిస్టులకు కంచుకోటగా ఉన్న మల్కన్‌గిరి జిల్లా స్వాభిమాన్ ప్రాంతం పూర్తిగా భద్రతా బలగాల ఆధీనంలోకి వచ్చినట్లు వివరించారు. అభివృద్ధి రంగంలో విశేషమైన పురోగతి ద్వారా ఈ ప్రాంతం సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రధాన స్రవంతిలో విలీనమయ్యిందని పేర్కొన్నారు. గురుప్రియ వంతెన నిర్మాణం మరియు సేతు (సామాజిక ఆర్థిక పరివర్తన మరియు ఉద్ధరణ) పథకం అమలు ఈ ప్రాంత ప్రజల జీవితాలు మరియు జీవనోపాధిలో గుర్తించదగ్గ పరివర్తన తీసుకురావడంలో కీలక పాత్ర పోషించింది. చదువును సులభతరం చేసేందుకు 7,000కు పైగా స్మార్ట్‌ఫోన్‌లను ఈ ప్రాంత విద్యార్థులకు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. మెరుగైన ఆరోగ్య సంరక్షణ కోసం అంబులెన్స్ వాహనాలు మరియు పారా మెడికల్ సదుపాయాలు విస్తరించారు. వీటితో బోట్ అంబులెన్స్ మరియు వాటర్ అంబులెన్స్ వ్యవస్థని ప్రవేశపెట్టారని సమావేశంలో మంత్రి వివరించారు.

డ్రోన్ల ద్వారా మందులు పంపిణీ

కలహండి జిల్లాలోని కొన్ని ప్రాంతాలకు డ్రోన్ల ద్వారా మందులు పంపిణీ చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి వాయు యోజన కింద ప్రజలకు మెరుగైన ఆరోగ్య సంరక్షణ కల్పించడం కోసం సూపర్ స్పెషలిస్ట్‌లను వివిధ ప్రాంతాలకు నియమించారన్నారు. వాయు యోజన కింద తరచూ వైద్య నిపుణులు తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలకు హెలికాప్టర్‌లో వెళ్లి వైద్య, ఆరోగ్య, చికిత్స సేవలను ప్రత్యక్షంగా అందజేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో నైపుణ్యత అభివృద్ధి మరియు మహిళా సాధికారతకు సంబంధించిన కార్యక్రమాలు అద్భుత ఫలితాలు సాధించాయి. మహిళలకు సులభతరమైన రుణాలు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. మావోయిస్టుల బెడదను అరికట్టేందుకు ఒడిశా ప్రభుత్వం తీసుకున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, రాబోయే సంవత్సరంలో దేశం నుంచి ఎల్‌డబ్ల్యూఈని నిర్మూలించేందుకు రాష్ట్రానికి అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

ఆఖరి మజిలీకి అష్టకష్టాలు



కాలువను దాటుతూ మృతదేహాన్ని మోసుకెళ్తున్న గ్రామస్తులు

జయపురం: జిల్లాలోని పలు గ్రామాలకు చెందిన ప్రజల ఆఖరి మజిలీకి అష్టకష్టాలు తప్పడం లేదు. కాలువలో ఉన్నటువంటి వర్షపు నీటిలోనే మృతదేహాన్ని మోసుకెళ్లాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. జయపురం సమితి టంకువ గ్రామ పంచాయతీ పరిధి ఒడిశా హైడ్రో పవర్ కార్పొరేషన్ గ్రామానికి తగిన రహదారి సౌకర్యం లేదు. ఈ గ్రామం జయపురం పట్టణానికి అతి చేరువలో ఉన్నా, సౌకర్యాల కల్పనకు చాలా దూరంలో ఆగిపోయింది. గ్రామానికి చెందిన రబి ఖొరా(60) మరణించగా, మృతదేహం అంత్యక్రియలకు శుక్రవారం ఉదయం గ్రామస్తులు పడరానిపాట్లు పడ్డారు. మోకాలు లోతు నీటిలో కాలువలో నడుచుకుంటూ మృతదేహాన్ని శ్మశానవాటికకు తీసుకెళ్లారు. ప్రతిఏటా ఇదే పరిస్థితి నెలకొంటున్నా కాలువపై వంతెన నిర్మించే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు పాఠశాలకు వెళ్లాలన్నా, ఆస్పత్రులకు వెళ్లాలన్నా కాలువ దాటాల్సిందేనని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువపై వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

బీజేపీ విజయానికి కృషి చేయాలి

- కేంద్ర రైల్వే సహాయ మంత్రి దర్శన జర్దోస్



మాట్లాడుతున్న మంత్రి దర్శన జర్దోస్



మంత్రి దర్శన జర్దోస్‌కు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు



కళ్లికోట్‌లో మట్టి సేకరిస్తున్న దృశ్యం

బరంపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీజేపీ విజయానికి కృషి చేయాలని కేంద్ర రైల్వే సహాయ మంత్రి దర్శన జర్దోస్ కోరారు. గంజాం జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా గోపాల్‌పూర్ తీరంలోని మేఫేర్ హోటల్‌లో దక్షిణ ఒడిశా స్థాయి బీజేపీ నాయకులతో శుక్రవారం ఉదయం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదేశం మేరకు సమష్టిగా పనిచేయాలన్నారు. ప్రతీ బ్లాక్‌లో పార్టీలో సభ్యులను చేర్చుకొని, కింది స్థాయి నుంచి పటిష్ట పరిచేవిధంగా సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. దేశంలోనూ, ఒడిశా రాష్ట్రంలోనూ బీజేపీ అనుకూల పవనాలు వీస్తున్నాయని తెలియజేశారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు భిబుతి జెనా, కన్ను చరణ్ పతి, కార్యదర్శి మధన్ మోహన్ పాత్రో, సునీల్ సాహు, కైలాస్ సడంగి బ్లాక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా పర్యటన

జిల్లా పర్యటనలో భాగంగా కళ్లికోట్ నియోజకవర్గంలో నా మట్టి – నా దేశం కలశంతో మంత్రి దర్శన జర్దోస్ పాదయాత్ర చేపట్టారు. అనంతరం హస్తకళా ప్రదర్శనను ప్రారంభించారు. సముద్ర తీరంలో ఉన్న అర్జిపల్లి గ్రామ మత్స్యకారులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కోదలా, పులసరా నియోజకవర్గాల్లోని ప్రజలతో కలిసి మాట్లాడారు.

అలుగు పట్టివేత.. ఇద్దరు అరెస్టు



మృతి చెందిన అలుగు

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి అటవీ శాఖ అధికారులు గురువారం రాత్రి గోవిందపల్లి కూడలి వద్ద పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో ఒక ద్విచక్ర వాహనంపై అతివేగంతో ఇద్దరు వ్యక్తులు రావడం గమనించి తనిఖీలు నిర్వహించగా, ఒక బ్యాగ్‌లో చనిపోయిన అలుగు గుర్తించారు. దీంతో అలుగును స్వాధీనం చేసుకొని, వారిద్దరినీ అరెస్టు చేశారు. ఈ ఇద్దరు అడవిలో అలుగులను పట్టి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం ఉంది. పట్టుబడిన నిందితులు మత్తిలి సమితి చెండగా గ్రామానికి చెందిన రామచంద్ర దొర, అబి గౌడ్‌లుగా నిర్ధారించారు. వీరిని మత్తిలి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో శుక్రవారం హాజరుపరిచారు.



అలుగుతో పట్టుబడిన నిందితులు

'వన్యప్రాణుల సంరక్షణ చర్యలు చేపట్టాలి'




సమావేశంలో పాల్గొన్న అధికారులు



వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాలకు హాజరైన విద్యార్థులు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో రోజురోజుకూ తరిగిపోతున్న అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాలులో 69వ వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ గవర తిరుపతిరావు మాట్లాడుతూ.. గజపతి జిల్లాలో లేఖరి, మహేంద్రగిరిల్లో అడవులు అంతరించిపోవడం వలన వన్యప్రాణులు కాశీనగర్ ప్రాంతం, ఆంధ్రప్రదేశ్‌లోని కొత్తూరు, భామిని ప్రాంతాలకు తరలిపోయి పంటనష్టం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో వన్యప్రాణులు అంతరించే అవకాశం ఉందని, రేపటి తరం జంతువులను పార్క్‌ల్లోనే చూడాల్సిన పరిస్థితి వస్తుందేమోనన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి సుబ్రహ్మణ్యం ఆనంద్ వన్యప్రాణుల సంరక్షణపై సెంచూరియన్ వర్సిటీ విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. వన్యప్రాణుల సంరక్షణకు ఎటువంటి చర్యలు చేపట్టాలో తెలియజేశారు. వన్య ప్రాణాలు సంరక్షణపై ఉత్తమంగా మాట్లాడిన విద్యార్థులకు కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు చేపట్టిన కాశీనగర్ వాసికి జిల్లా అటవీశాఖ అధికారి, ఎస్పీ స్వాతి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులతో పాటు, కేంద్రీయ విద్యాలయం, సెంచూరియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ విస్తరణకు మాస్టర్ ప్లాన్



ప్రస్తుత జయపురం మున్సిపాలిటీ ప్రాంతం

జయపురం: జయపురం మున్సిపాలిటీ విస్తరణకు డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ తయారైంది. వాస్తవానికి కొరాపుట్ రీజనల్ ఇంప్రూవ్‌మెంట్ ట్రస్టు(క్రిట్) 1985లో మాస్టర్ ప్లాన్ ప్రతిపాదించారు. దీనిలో భాగంగా ప్రతీ 20 ఏళ్లకు ఒకసారి మాస్టర్ ప్లాన్లను తయారు చేస్తారు. అంటే ఇప్పటికీ రెండు మాస్టర్ ప్లాన్‌లు చేయాల్సి ఉంది. కానీ 38 ఏళ్లుగా అలా జరగలేదు. 2015లో న్యూఢిల్లీ ఎస్ఎఫ్ ఇన్‌ఫ్రాటెక్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఎస్.ఆర్.ఎస్ మాస్టర్ ప్లాన్ బాధ్యతలు అప్పగించారు. ఆ సంస్థ మే నెలలో డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌ను క్రిట్‌కు అందజేసింది. క్రిట్ పరిశీలించి అందులో 12 లోపాలను గుర్తించింది. ఆ లోపాలను సవరించి తిరిగి డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ సమర్పించాలని ఆ సంస్థకు సూచించింది. అనంతరం ప్లాన్‌పై అభ్యంతరాలను స్వీకరించింది. అయితే ఎటువంటి అభ్యంతరాలు రాలేదని క్రిట్ వెల్లడించింది. ఈ మాస్టర్ ప్లాన్ ప్రకారం పాత జయపురం మున్సిపాలిటీలో జయపురం సమితిలోని 17 గ్రామాలు కలవనున్నాయి. ప్రస్తుతం జయపురం మున్సిపాలిటీలో ఖాతా నంబర్ 98, జయనగర్ మౌజ ఖాతా నంబర్ 78లో కొంత భాగం, అలాగే జగధాత్రిపూర్, లక్ష్మణపూర్, బిద్యాధరపూర్, విక్రమనగర్, బాలాజీపూర్, నీలకంఠేశ్వరపూర్, ఉమ్మిరి, బంకబిజ, మొకాపుట్, సవురగుడ, జగన్నాథ్‌పూర్, కటారిపుట్, పినాకిరిజర్వ్ జంగిల్ మొదలైనవి ఉన్నాయి. వీటితో పాటు ఉమ్మరి, బరిణిపుట్, టంకువ, గొడొపాదర్, బలియ, ఎకంబ పంచాయతీల్లో వివిధ మౌజాలను కలుపుతారు. అదేవిధంగా ప్లాన్‌లో ఉత్తరాన రెవెన్యూ గ్రామాల్లో ఎకంబా, బిశాయిపుట్, హర్ధలి, దక్షిణాన టంకువ, పద్మపూర్, ఘాట్‌ఘుమర గ్రామాలు, తూర్పున కొలాగుడ, తెలిగుడ, దుబులి, బాలిజొడి, బరిణిపుట్, నకటిడొంగర, ముండిగుడ గ్రామాలు, పశ్చిమాన ఎకంబా, గగణాపూర్, కుంతరకాల్ గ్రామాలు జయపురం మున్సిపాలిటీలో ఏకమవుతున్నాయి. దీంతో జయపురం మున్సిపాలిటీ జనాభా 2040 నాటికి 1,47,450లకు పెరుగుతుందని అంచనా.



జయపురం మున్సిపాలిటీ డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్

క్లుప్తంగా

దోమ తెరలు పంపిణీ



గర్భిణులకు దోమ తెరలు అందజేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: కాశీనగర్ సమితి కె.సీతాపురం పంచాయతీ ఇప్పగుడలో ప్రవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అట్టాడ అప్పారావు అనే వ్యక్తి గర్భిణులకు దోమ తెరలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మలేరియా, డెంగీ వ్యాధులపై స్వచ్ఛంద సంస్థ కో-ఆర్డినేటర్లు దిలీప్, నిరంజన్ నాయక్‌లు అవగాహన కల్పించారు.

బోండఘట్టీకి లక్ష్మీ పథకం బస్సు



బోండఘట్టీపైకి వెళ్లిన లక్ష్మీ బస్సు

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖోయిర్‌పూట్ సమితి బోండఘట్టీపైకి లక్ష్మీ పథకంలో భాగంగా మంజూరైన బస్సు తొలిసారి వెళ్లింది. వాస్తవానికి ఈనెల 12వ తేదీ నుంచి ఈ బస్సులు ప్రారంభమవ్వాల్సి ఉండగా, టెస్ట్ డ్రైవ్ నిమిత్తం శుక్రవారం తీసుకెళ్లారు. బోండఘట్టీ భూమికి 4 వేల అడుగుల ఎత్తులో ఉండడంతో ఇప్పటివరకు అక్కడికి బొలేరో వాహనాలు మాత్రమే వెళ్లేవి. ఇక నుంచి బస్సులు నడపాలని నిర్ణయించడంతో 35 మంది బోండో గిరిజనులతో టెస్ట్ డ్రైవ్ నిర్వహించారు. దీంతో తమ గ్రామాలకు బస్సులు రానున్నాయని గిరిజనులు ఆనందం వ్యక్తం చేశారు.

ఎంబీఏ, ఎంసీఏల్లో మెరుగైన ప్రవేశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఐసెట్-2023 (ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాల సెట్) అలాట్‌మెంట్‌లను ఉన్నత విద్యా మండలి ప్రకటించింది. జిల్లా కళాశాలల్లో మెరుగైన ప్రవేశాలు లభించాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఎంబీఏలో 55 సీట్లకు 55 ప్రవేశాలు లభించాయి. ఎంసీఏలో 44కి 44 సీట్లు నిండాయి. ప్రైవేట్ కళాశాలల్లో ఐతం 60కి 30, వెంకటేశ్వరలో 60కి 57, శివానీలో 60కి 16 సీట్లు నిండాయి.

విద్యార్థులకు అభినందనలు



జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ప్రసాదరావు, పోలీస్ అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులను పోలీసు అధికారులు అభినందించారు. కర్నూలు జిల్లా మహానందిలో జరిగిన పోటీల్లో రాణించిన ఎస్.నందిని (ఎచ్చెర్ల అంబేడ్కర్ గురుకుల పాఠశాల), ఎం.గాయిత్రి (చైతన్య కోఆపరేటివ్ కాలేజ్, శ్రీకాకుళం), ఎస్.హేమంత్‌కుమార్ (కుశాలపురం ప్రాథమిక పాఠశాల), ఎల్.మణికంఠ (మహాత్మా జ్యోతిబాపులే, నరసన్నపేట పాఠశాల) జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరిని ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయంలో శుక్రవారం డీఎస్పీ డి.ప్రసాదరావు, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు సురేష్, ఉమామహేశ్వరరావు, ఆర్ఎస్సైలు వరప్రసాద్, రవి, ముబారక్ ఆలీ, సత్తిబాబు, ఉమామహేష్ అభినందించారు. రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. సీనియర్ క్రీడాకారులు పురుషోత్తం, పీడీ సింహాద్రి నాయుడు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించాలి'

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల డిమాండ్లను ఆర్టీసీ యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కార్యాలయ ఆవరణలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈయూ నాయకులు మాట్లాడుతూ సమస్యలు ప్రస్తావించారు. అన్ని నైట్‌ఔట్స్ ప్రదేశాల్లో వసతి సౌకర్యం కల్పించాలని, ఏడీ/పీడీ సెక్షన్‌లలో పనిచేస్తున్న క్లర్కులపైన పని భారం తగ్గించాలని కోరారు. అన్ని కేటగిరీల వారీగా రిక్వెస్ట్ బదిలీలు క్లియర్ చేయాలని, అలవెన్సులు చెల్లించాలని కోరారు. మహిళా ఉద్యోగులకు కచ్చితంగా నెలకి మూడు రోజులు రుతుక్రమణ లీవ్ ఇచ్చే విధంగా తగు ఆదేశాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో ఆర్టీసీ ఈయూ నాయకులు జి.త్రినాథ్, ఎస్‌వి రమణ, కె.బాబూరావు, పి.నానాజీ, ఖాదర్, జోగారావు, త్రివేణి, డి.లక్ష్మి, పాపారావు, బీఎస్ బాబు, అధిక సంఖ్యలో ఇయూ ఉద్యోగులు ఉన్నారు.

పోక్సో కేసుపై విచారణ

శ్రీకాకుళం క్రైమ్ : స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం రాత్రి నమోదైన పోక్సో కేసుపై దిశా డీఎస్పీ ఎస్.వాసుదేవరావు విచారణ చేపట్టారు. గత నెల 30న రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో తమ కుమార్తె అదృశ్యమైందంటూ సంతబొమ్మాళి మండలానికి చెందిన మైనరు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఆమెను అదే మండలానికి చెందిన యువకుడు మోసగించినట్లు బాలిక తల్లి ఫిర్యాదు ఇవ్వడంతో పోక్సో కేసు నమోదైంది.

నిఘా చర్యలపై అవగాహన అవసరం



సన్నాహక సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: నిఘా చర్యలపై రైల్వే సిబ్బందికి అవగాహన అవసరమని, అనుబంధ వర్గాలను చైతన్య పరచి ముందుకు సాగాలని తూర్పు కోస్తా రైల్వే డిప్యూటీ చీఫ్ విజిలెన్స్ అధికారి ప్రీతిరాజ్ పాణిగ్రాహి తెలిపారు. ఖుర్దారోడ్ రైల్వే అధికారుల క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక చైతన్య సమావేశానికి ఆయన ప్రత్యక్షంగా హాజరై మాట్లాడారు. ఏటా మాదిరిగా ఈనెల 30వ తేదీ నుంచి నవంబర్ 5 వరకు తూర్పు కోస్తా రైల్వే విజిలెన్స్ చైతన్య వారం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ముందస్తు సన్నాహాల్లో భాగంగా ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఆచితూచి వ్యవహరించాలి

విజిలెన్స్ కేసుల వ్యవహారంలో పట్టు సాధించడం అత్యంత అవసరమని ప్రీతిరాజ్ పాణిగ్రాహి తెలియజేశారు. నిర్దిష్టమైన మార్గదర్శకాలను పకడ్బందీగా అమలు చేసేందుకు ఆచితూచి వ్యవహరించాలని సిబ్బందికి పిలుపునిచ్చారు. ఈ క్రమంలో అనుసరించాల్సిన పలు విధానాలను సమావేశానికి హాజరైన సిబ్బందికి వివరించారు. ఫిర్యాదుల నిర్వహణ యంత్రాంగం విజిలెన్స్ కేసుల నమోదు, విచారణ, వగైరా కార్యకలాపాల్లో అనుసరించాల్సిన మరియు చేయకూడని ప్రధానాంశాల్ని పేర్కొన్నారు. ఖుర్దా రోడ్ అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ సుభ్ర జ్యోతి మండల్ మాట్లాడుతూ.. విజిలెన్స్ కేసులను డీల్ చేసేటప్పుడు అందరూ బాధ్యతగా వ్యవహరించాలని మరియు విధివిధానాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. సమావేశంలో సమీర్ మహాపాత్రో, ఏవీఓ ఎ.రామారావు తదితరులు పాల్గొన్నారు.

మరోసారి టెండర్లు పిలవండి

- అధికారులకు గ్రామ ప్రజల వినతి



బీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జయపురం: సమితి పరిధిలోని రాణిగుడ గ్రామ పంచాయతీలో ప్రాథమిక వైద్య కేంద్రం నిర్మించేందుకు మరోసారి టెండర్లు పిలవాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. మొదటి పిలిచిన టెండర్ ఏదో కారణంతో రద్దు చేశారని, అందువలన మరోసారి టెండర్ పిలిచి వైద్య కేంద్రం నిర్మించాలని రాణిగుడ పంచాయతీ ప్రజలతో పాటు మాజీ సమితి సభ్యుడు మోహన్ కందపాణి, సీనియర్ బీజేడీ నాయకుడు లింగ పాత్రో, వల్లభ నాయిక్, పవిత్ర హరిజన్‌లు జయపురం సమితి బీడీవో రాజీవ్ దాస్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మోహన్ కంపాణి మాట్లాడుతూ రాణిగుడ పంచాయతీలో వైద్య సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. వైద్యం కోసం ప్రజలు జయపురం, కుములిపుట్, బొరిగుమ్మ, కొరాపుట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువలన పంచాయతీ ప్రజలు ఎంతోకాలంగా రాణిగుడ పంచాయతీలో ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కోరుతున్నారన్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం ఆస్పత్రి నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరు చేసిందని వెల్లడించారు. అయితే నిర్మాణం కోసం మొదట టెండర్లు పిలిచిన అధికారులు మరలా రద్దు చేశారని ఆరోపించారు. అందువలన మరోసారి టెండర్లు పిలవాలని కోరారు.

హోటళ్లపై అధికారుల దాడులు

- డొమస్టిక్ గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

రాయగడ: హోటళ్లలో నిబంధనలకు విరుద్ధంగా డొమస్టిక్ గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు, సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్ర దేవ్ ఆదేశానుసారం పౌర సంబంధాల శాఖ అధికారులు శుక్రవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. సదర్ పౌర సంబంధాల శాఖ అధికారి సత్యనారాయణ భోయ్ ఆధ్వర్యంలో మార్కెటింగ్ ఇన్‌స్పెక్టర్లు చేతన్ బెహర, అనిల్ కుమార్ గొమాంగో, సుధాంశు భోయ్‌ల బృందం చేపట్టిన దాడుల్లో 60 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఐసీడీఎస్ కూడలిలో గల సాయిరాం రెస్టారెంట్‌లో 4 డొమస్టిక్ గ్యాస్ సిలిండర్లు, ఓం సాయిరాం రెస్టారెంట్‌లో మరో 5 డొమస్టిక్ గ్యాస్ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హోటళ్లలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను వినియోగించాలన్న నిబంధనలు ఉన్నప్పటికీ, నిబంధనలను తుంగలో తొక్కి డొమస్టిక్ గ్యాస్ సిలిండర్లను వినియోగించడం చట్ట విరుద్ధమని అధికారులు హోటళ్ల యజమానులపై మండిపడ్డారు. ఈ మేరకు వారిపై కేసులను నమోదు చేశారు. అదేవిధంగా స్థానిక నెహ్రూనగర్ నుంచి మ్యాక్సీ పికప్ వ్యాన్ నుంచి ఇండన్ గ్యాస్ సంస్థకు చెందిన సిలిండర్లు వస్తుండగా వాటిని అధికారులు తనిఖీలు నిర్వహించారు. అందుకు సంబంధించిన అనుమతి పత్రాలను చూపిస్తే వాహనాన్ని విడిచిపెడతామని అంతవరకు వాహనంలో ఉన్నటువంటి 51 సిలిండర్లను తాము స్వాధీనం చేసుకుంటున్నట్లు వెల్లడించారు.



హోటళ్లలో దాడులు నిర్వహిస్తున్న అధికారులు

రోడ్డు ప్రమాదంలో సీఆర్‌పీఎఫ్ జవాన్ మృతి



అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న సిబ్బంది



రవికుమార్ (ఫైల్)

సారవకోట: మండలంలోని అంగూరు గ్రామానికి చెందిన లింగుభేరి రవికుమార్ (41) గురువారం మహారాష్ట్రలోని లాసూర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈయన లాసూర్‌లో సీఆర్‌పీఎఫ్‌లో విధులు నిర్వర్తిస్తూ అక్కడకు 30 కిలోమీటర్ల దూరంలో రోడ్డు ప్రమాదంలో గురువారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని శుక్రవారం స్వగ్రామానికి సంబంధిత సిబ్బంది తీసుకొచ్చి అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వర్తించారు. మృతుడికి భార్య రోహిణి, కుమారుడు సుశాంత్, కుమార్తె నివేదిత ఉన్నారు.

'బీజేపీవి ఆర్ఎస్ఎస్ భావజాల పునాదులు'

శ్రీకాకుళం అర్బన్: ఆర్ఎస్ఎస్ భావజాల పునాదులపై బీజేపీ నడుస్తోందని డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి ధ్వజమెత్తారు. శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్ వద్ద శుక్రవారం బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ రాహుల్ గాంధీని రావణుడితో పోల్చుతూ బీజేపీ పోస్టర్లు వేయడం అవమానకరమన్నారు. ఇలాంటి చర్యలు బీజేపీ నాయకుల దురహంకారానికి పరాకాష్ట అని తెలిపారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సనపల అన్నాజీరావు, దేశెళ్ల గోవింద మల్లిబాబు, అంబటి కృష్ణారావు, రెల్ల సురేష్, కె.వి.ఎల్.ఎస్.ఈశ్వరి, లఖినేన సాయిరాం, బస్వా షణ్ముఖరావు, బొచ్చ వెంకటరమణ, తెంబూరు మధుసూదన్‌రావు, వి.శాంతారావు, అంబటి దాలినాయుడు, ఆబోతుల వెంకట నాయుడు, మామిడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'జీడికి గిట్టుబాటు ధర కల్పించాలి'

కాశీబుగ్గ: జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, పంట సమగ్రాభివృద్ధికి జీడి బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కోనారి మోహనరావు డిమాండ్ చేశారు. కాశీబుగ్గ సీపీఎం కార్యాలయంలో శుక్రవారం జీడికి గిట్టుబాటు ధర కల్పించాలని ఈ నెల 10వ తేదిన కాశీబుగ్గలో జరగనున్న రాష్ట్ర సదస్సు కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం సీపీఎం నాయకులు ఎన్.గణపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆ యన మాట్లాడారు. స్థానికంగా పండిన జీడిపిక్కలు కొనుగోలు చేసిన అనంతరం మాత్రమే విదేశీ జీడి పిక్కలు దిగుమతికి అనుమతించాలని, ఉపాధి హామీ పథకం ద్వారా జీడి తోట అభివృద్ధికి ఎకరాకు రూ.94 వేలు రైతులకు క్షేత్రస్థాయిలో అందించాలని కోరారు.

పెంపుడు కోళ్లపై విష ప్రయోగం



రావివలస గ్రామంలో మృత్యువాత పడిన కోళ్లు

టెక్కలి: టెక్కలి మండలం రావివలస గ్రామంలో భీముని వనజనాభం అనే వ్యక్తికి చెందిన 28 పెంపుడు కోళ్లపై విష ప్రయోగం జరిగింది. వనజనాభం పెంపుడు కోళ్లను పెంచుతూ విక్రయిస్తుంటారు. అయితే శుక్రవారం ఉదయం కోళ్ల షెడ్డును చూసేసరికి ఒక్కసారిగా కోళ్లు చనిపో యి ఉండడాన్ని గమనించారు. దీంతో గ్రామ సర్పంచ్ సర్లాన బాలకృష్ణ, గ్రామపెద్ద సర్లాన సుధాకర్‌కు సమాచారం అందజేశారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. పశు సంవర్ధక శాఖ సిబ్బందికి సమాచారం అందజేయడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృత్యువాత పడిన కోళ్లకు పంచనామా చేశారు. చివరగా విష ప్రయోగం జరిగినట్లుగా గుర్తించారు. ఈ సంఘటన పై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ ఉత్తర్వులు సంతోషకరం

నరసన్నపేట: ప్రభుత్వ పెన్షన్ పొందుతున్న విశ్రాంత ఉద్యోగుల భార్యలు ఆయన కంటే ముందు చనిపోతే మట్టి ఖర్చుల కింద రూ.25వేలు ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. గతంలో ఈ విధానం ఉన్నా 2022 కొత్త పీఆర్‌సీ వచ్చిన తర్వాత దీన్ని నిలిపివేశారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకువెళ్లగా వెంటనే స్పందించి మట్టి ఖర్చుల ఉత్తర్వులను సవరించిందని టెక్కలి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆర్.రామచంద్రరావు తెలిపారు. గతంలో నిలిపి వేసిన తేదీ నుంచి ఈ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని తెలిపారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో నరసన్నపేట, పోలాకి మండలాలకు చెందిన విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం విడుదల చేసిన కొత్త జీఓ గురించి ఆయన వివరించారు. నరసన్నపేట సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ప్రభాకరరావు, బి.మోహనరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష



ప్రభుత్వ శాఖల కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: ప్రభుత్వ శాఖల పనితీరు, పురోగతిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా సమీక్షించారు. స్థానిక ఖారవేళ భవన్‌లో ఆయన అధ్యక్షతన ప్రభుత్వ శాఖల కార్యదర్శుల సమావేశం గురువారం జరిగింది. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి వివిధ శాఖలు సాధించిన ఫలితాలను ఈ సమావేశంలో సమీక్షించారు. 2023-24 ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో సమగ్ర రాష్ట్ర ప్రభుత్వం, శాఖలవారీ పని తీరుని క్షుణ్ణంగా విశ్లేషించారు. ప్రధానంగా జిల్లా మినరల్ నిధి (డీఎంఎఫ్) వ్యయ విధానంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ ఏడాది బడ్జెట్ కేటాయింపులో 34.87 శాతం నిధులు వెచ్చించారు. గతేడాది ఈ సమయానికి బడ్జెటు నిధుల వినియోగం 25.61 శాతానికి పరిమితమైనట్లు సమీక్షలో తేటతెల్లమయ్యింది. మత్స్య మరియు పశు వనరుల విభాగం (ఏఆర్డీ) గత సంవత్సరం కంటే ఈ ఏడాది బడ్జెటు నిధుల సద్వినియోగంలో 158 శాతం వృద్ధిని సాధించింది. మౌలిక సౌకర్యాల రంగంలో (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) విద్యుత్ శాఖ గతేడాది కంటే అత్యధికంగా 2400 శాతం వృద్ధిని సాధించడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం స్వంత పన్నుల ఆదాయం గణనీయంగా పుంజుకుంది. గతేడాది కంటే 14.59 శాతం అధిక ఆదాయం నమోదైనట్లు సమీక్ష సమావేశంలో గుర్తించారు. 2023-24 ఆర్థిక సంవత్సరపు అనుబంధ బడ్జెట్ వ్యయ మంజూరి ప్రతిపాదనలను శాసన సభ ఆమోదించింది. ఈ నేపథ్యంలో బడ్జెటు కేటాయింపులను సకాలంలో సద్వినియోగపరచుకోవడంలో అన్ని ప్రభుత్వ శాఖలు ప్రత్యేకంగా శ్రద్ధ వహించాలని చీఫ్ సెక్రటరీ పిలుపునిచ్చారు.

పాట ఆగింది

- రోడ్డు ప్రమాదంలో జానపద గాయకుడు మృతి



రికార్డింగ్ సెంటరులో పాట పాడుతున్న అశోక్

పలాస, కాశీబుగ్గ: పలాస మండలం మాకన్నపల్లి గ్రామానికి చెందిన జానపద కళాకారుడు, గాయకుడు సాలిన అశోక్‌కుమార్(31) శుక్రవారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన జాతీయ రహదారి రోడ్డు పనుల్లో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా మధ్యాహ్నం భోజనం చేసి ఇంటి నుంచి తన స్కూటీపై వెళ్తుండగా మాకన్నపల్లి రోడ్డు మలుపు వద్ద ఎదురుగా వచ్చిన బొలేరో లగేజ్ వ్యాను ఢీకొనడంతో అక్కడికక్కడే ఊపిరి వదిలేశాడు. విషయం తెలిసిన వెంటనే పరిసర గ్రామ ప్రజలంతా అక్కడకు చేరుకొని భోరున విలపించారు. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులు ఉన్నారు. వారి రోదన ఆపడం ఎవరి తరం కాలేదు. అలాగే ఉద్దానం ప్రాంతానికి చెందిన కళాకారులు, గాయకులు అక్కడకు చేరుకొని అతని జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మృతదేహాన్ని కాశీబుగ్గ పోలీసులు సంఘటన స్థలం నుంచి పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ఆయన స్వగ్రామం మాకన్నపల్లికి తీసుకెళ్లి అంత్యక్రియలు జరిపించారు. ఈ సందర్భంగా ఉద్దానం సాహితీ సాంస్కృతిక వేదిక ఉపాధ్యక్షుడు కుత్తుం వినోద్ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు.

కవులు, రచయితలు డాక్టరు కుమార్‌నాయక్, పత్తిరి తాతారావు, కిక్కర ఢిల్లీరావు, సిక్కోలు జానపద వేదిక అధ్యక్షుడు రాపాక ధనరాజు, మల్లేన దేవరాజు, రంగోయి తులసి, జానపద పరిశోధకుడు బద్రి కూర్మారావు, వంకల రాజారావు తదితరులు సంతాపం తెలియజేశారు.



ప్రమాదస్థలంలో అశోక్‌కుమార్ మృతదేహం

వ్యక్తి అనుమానాస్పద మృతి

రణస్థలం: కొండములగాం పంచాయతీలో గల ముక్తుంపురం గ్రామానికి చెందిన జామి రాము(55) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. జేఆర్ పురం ఎస్ఐ జి.రాజేష్ తెలిపిన వివరాలు ప్రకారం మక్తుంపురం గ్రామానికి చెందిన రాము పౌరాణిక నాటకాలతో పాటు, రోజువారీ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈయనకు మణికంఠ అనే కుమారుడు, భార్య లక్ష్మి ఉన్నారు. ఈ కుటుంబంలో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి కుమారుడు మణికంఠకు తండ్రి రాముకు గొడవ జరిగినట్లు చుట్టుపక్కల వారు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం రాము చనిపోయి ఉండటం, మెడకు ఉరి వేసినట్లు గాయాలు కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. అప్పటికే రాము అంత్యక్రియలు చేసేందుకు కుటుంబ సభ్యులు సన్నాహాలు చేస్తున్న సమయంలో పోలీసులు రంగప్రవేశం చేసి అంత్యక్రియలను నిలిపివేశారు. అనంతరం కుమారుడు మణికంఠను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించారు. రాము మృతదేహాన్ని శ్రీకాకుళం సర్వజనాస్పత్రికి తరలించారు. దీనిపై జేఆర్ పురం ఎస్ఐ జి.రాజేష్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.



మృతి చెందిన రాము

జాబ్‌మేళాలో 184 మంది ఎంపిక

పాతపట్నం: యువత స్థానికంగా ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ఎక్కడ ఉద్యోగం వచ్చినా చేసుకోవాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం మెగా ఉద్యోగ మేళా నిర్వహించారు. మేళాలో 10 ప్రైవేటు సంస్థలు పాల్గొని 184 మందిని వివిధ కంపెనీలకు ఎంపిక చేశాయి. జిల్లా నైపుణ్యాభివృద్ధి సాయి శ్రీనివాస్, సెట్ శ్రీ సీఈవో ప్రసాదరావు, జిల్లా టూరిజం అధికారి నారాయణరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని నియోజకవర్గాల్లోనూ స్కిల్ హబ్స్ ద్వారా యువతకు సాంకేతిక పరిజ్ఞానాన్ని, తరగతులను, ల్యాబ్‌లను ఏర్పాటు చేసి, శిక్షణలను అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఎంపికైన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఉన్నతిమైన ఆలోచన



- ఉపాధి వేతనదారుల కుటుంబాల్లో యువతకు ఉచిత శిక్షణ
- శిక్షణ కాలానికి స్టయిఫండ్
- జిల్లాలో 20వేల మందికి అవకాశం

శ్రీకాకుళం పాతబస్టాండ్: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం.. ఎన్నో వేల కుటుంబాలకు అన్నం పెడుతోంది. ఇప్పుడు ఆ పథకాన్ని మరో మెట్టు పైకి ఎక్కిస్తూ 'ఉన్నతి' కార్యక్రమానికి రూపకల్పన చేశారు. ఆ మేరకు ఉపాధి పథకంలో పని చేస్తున్న వేతనదారుల కుటుంబాల్లోని యువతకు ఉచితంగా పలు అంశాల్లో శిక్షణలు అందజేయనున్నారు. అందుకు కావాల్సిన కార్యాచరణను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఉపాధి పనులు చేస్తున్న వారి కుటుంబాల్లో ఆసక్తి గల యువతకు పలు వృత్తుల్లో శిక్షణ ఇవ్వడం, ఆ సమయంలో స్టయిఫండ్ ఇచ్చి ఆర్థిక ఇబ్బంది లేకుండా చేస్తారు. ఈ ఏడాది లోనే తొలి విడత శిక్షణ ప్రారంభం కానుంది. జిల్లాలో ఈ విడతలో ఎస్సీ, బీసీ, ఎస్టీ వర్గాల నుంచి వంద రోజులు పనిదినాలు పూర్తి చేసి వారి కుటుంబాల నుంచి దాదాపు 20వేల మందికి ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది.

వంద రోజుల పాటు స్టయిఫండ్

తొలుత వంద రోజులు పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాలను గుర్తిస్తారు. అనంతరం ఆ కుటుంబాల్లోని యువతకు శిక్షణలకు పిలుస్తారు. ఈ శిక్షణ పూర్తి ఉచితం. అలాగే శిక్షణ కాలంలో రోజు వారీ వేతనం డబ్బులను స్టయిఫండ్ రూపంలో అందజేస్తారు. సంబంధిత శిక్షణలో యువత కనీసం 75 శాతం రోజులు విధిగా హాజరు కావాల్సి ఉంటుంది. గరిష్ఠంగా వందరోజులు ఉపాధి హామీ పనులు చేసిన కుటుంబాల వారికే ఈ అవకాశం ఇస్తున్నారు. సంబంధిత సంస్థలు క్షేత్రస్థాయిలో పనిచేసే ఉపాధి హామీ పథకం సిబ్బంది సాయంతో.. ఆయా కుటుంబాలను ప్రత్యక్షంగా సందర్శించి శిక్షణ పొందేందుకు ఆసక్తి గల యువత పేర్లను నమోదు చేసుకుంటారు. ఆ తర్వాత అర్హులైన వారికి సీడాప్, ఆర్ఎస్ఈటిఐ, కేవీకే వంటి సంస్థల ద్వారా శిక్షణ అందజేస్తారు. ఈ శిక్షణకు గ్రామ స్థాయిలో ఉపాధి హామీ పథకం సిబ్బంది వద్ద నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది.

అర్హతలు

ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల వారి యువతకు 18-45 ఏళ్ల మధ్య, ఇతర సామాజిక వర్గాల్లో 18-35 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ఈ కుటుంబం గత ఏడాదిలో వంద రోజులు పనిదినాలు చేసి ఉండాలి. జిల్లాలో గత ఏడాది వందరోజులు పనిదినాలు పూర్తి చేసిన వారు ఎస్సీ సామాజిక వర్గంలో 5537, ఎస్టీ సామాజిక వర్గంలో 4382, బీసీ సామాజిక వర్గంలో 49,915 మంది కుటుంబాలు ఉన్నాయి. వీరిలో సుమారుగా 20 వేల మంది వరకు యువత ఈ శిక్షణ ప్రయోజనం పొందేందుకు అవకాశం ఉంది.

192 రకాల శిక్షణలు

ఈ శిక్షణలు 192 రకాలు అందజేయనున్నారు. అయితే ఆ ప్రాంతాల అవసరాలు, వనరులు, శిక్షణ ఇచ్చే సంస్థ వెసులుబాటును బట్టి అక్కడ శిక్షణల ఎంపికలు ఉంటాయి. కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు ద్విచక్ర వాహనాల రిపేర్లు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ రిపేర్ అండ్ సర్వీసింగ్, ఇంటర్నెట్ సేవలు వంటి శిక్షణలు ఉంటాయి.

వంద రోజుల పనుల ఆధారంగా

గత ఆర్థిక సంవత్సరంలో వంద రోజులు పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాల నుంచి అర్హత మేరకు యువతను ఎంపిక చేసి శిక్షణను అందజేస్తారు. గ్రామస్థాయిలో గ్రామ సహాయకుల ద్వారా అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణ జరుగుతుంది. ఈ శిక్షణల వల్ల యువతకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది.

– జీవీ చిట్టిరాజు, పీడీ, డ్వామా, శ్రీకాకుళం.

క్లుప్తంగా

20 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్



మద్యం సీసాలతో పట్టుబడిన వ్యక్తి

గంట్యాడ: మద్యం సీసాలు అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. గంట్యాడ మండలంలోని లక్కిడాం గ్రామానికి చెందిన కిలపర్తి లక్ష్మణ్ గ్రామంలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో లక్ష్మణ్ గ్రామంలో మద్యం విక్రయించడానికి కొఠారుబిల్లిలో మద్యం సీసాలను కొనుగోలు చేసి తరలిస్తుండగా అదే గ్రామంలోని జంక్షన్ వద్ద పోలీసులు మాటు వేసి పట్టుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసిన నిందితుడిని రిమాండ్‌కు తరలించనున్నట్లు ఎస్సై కె. కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

పాముకాటుతో వ్యక్తిమృతి



అప్పలనాయుడు (ఫైల్)

బాడంగి: మండలంలోని వీరసాగరం గ్రామానికి చెందిన లచ్చుపతుల అప్పలనాయుడు(54)పాముకాటుకు గురై మృతిచెందాడు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. బుధవారం పంటపొలానికి వెళ్లిన అప్పలనాయుడిని పాముకరవడంతో ప్రథమ చికిత్సకోసం స్థానిక సీహెచ్‌సీకి 108లో తరలించారు. అనంతరం మెరుగైన వైద్యంకోసం విజయనగరం సర్వజన ఆస్పత్రికి, అక్కడినుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుని భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఆర్.జయంతి శుక్రవారం తెలిపారు.

పాముకాటుతో మరో రైతు..



సాంబ మృతదేహం

రామభద్రపురం: మండలకేంద్రానికి ఓ రైతు శుక్రవారం పాముకాటుకు గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎగువ హరిజన వీధికి చెందిన చీపురు సాంబ(53) చింతవాని పొలంలో గొల్లవాల పూను వద్ద తన పొలంలో పత్తి పంటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న క్రమంలో చూసుకోకుండా కింద ఉన్న పామును మట్టిశాడు. దీంతో పాము రైతు కాలిని చుట్టేసి కాటువేసింది. వెంటనే కుటుంబసభ్యులకు విషయం తెలియజేయగా ప్రథమ చికిత్స నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుని భార్య కళావతి ఫిర్యాదు మేరకు ఎస్సై సురేంద్రనాయుడు కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

రైలు ధాటికి వ్యక్తి..

బొబ్బిలి: మండలంలో పెంట గ్రామానికి చెందిన గుల్ల తిరుపతిరావు(40) రైల్వే ట్రాక్ పక్క నుంచి నడుచుకుంటూ పొలానికి వెళ్తుండగా అదే సమయంలో వస్తున్న రైలు స్పీడ్ ధాటికి పక్కన పడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన తిరుపతిరావును బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారని ఎస్సై చదలవాడ సత్యనారాయణ తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మృతుడికి భార్య హేమలత, కుమారుడు రామకృష్ణ, వివాహమైన కుమార్తె హైమావతి ఉన్నారు.

ఆటో, బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వరలక్ష్మి, వంశీ

పార్వతీపురంటౌన్: ఆటో, బైక్ ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పార్వతీపురం మండలం లచ్చరాజుపేట గ్రామ సమీపంలో శుక్రవారం ఈ ప్రమాదం జరిగింది. జిల్లా ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బందలుప్పి గ్రామం నుంచి బైక్, పెదబొండపల్లి నుంచి బందలుప్పి వైపు వెళ్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొనడంతో బైక్ నడుపుతున్న పత్తిగోల వంశీ, ఆటోలో ఉన్న మడక వరలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనం ద్వారా పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రికి వారిద్దరినీ తరలించారు. ఈ ఘటనపై ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటినుంచి అందుబాటులో సదరం స్లాట్స్

విజయనగరం ఫోర్ట్: దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ పొందేందుకు అవసరమైన స్లాట్ బుకింగ్ 7వతేదీనుంచి 10 వతేదీ వరకు అందుబాటులో ఉంటాయని డీసీహెచ్‌ఎస్ గౌరీశంకర్ తెలిపారు. దివ్యాంగులు మీసేవ, గ్రామ సచివాలయాలకు వెళ్లి స్లాట్స్ బుక్ చేసుకోవాలని సూచించారు.

బాల్య వివాహాలు చేస్తే ఖబడ్దార్..!

- బాధ్యులు, హాజరైన వారిపై కఠిన చర్యలు
- కలెక్టర్ నాగలక్ష్మి హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం ఫోర్ట్: బాల్యవివాహాలు చేసే వారు, పాల్గొన్న వారిపై కేసులు నమోదు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. బాల్య వివాహాలను అరికట్టడానికి అన్ని శాఖలు సమన్వయంతో, సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాల్య వివాహాలపై జిల్లా స్థాయి కన్వర్జెన్సీ సమావేశాన్ని కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టేందుకు సమర్థవంతమైన కార్యాచరణ ప్రణాళికను రుపొందించాలని తెలిపారు. బాల్య వివాహాల వల్ల ఎన్నో దుష్పరిణామాలు సంభవిస్తాయన్నారు. బాల్య వివాహాల నివారణ కేవలం స్త్రీ, శిశు సంక్షేమ శాఖపైనే కాకుండా, ఇతర శాఖలపైన కూడా ఉందని స్పష్టం చేశారు. మండల స్థాయి బాల్య వివాహ నిషేధ అధికారులు మరింత క్రియా శీలకంగా వ్యవహరించాలని సూచించారు. వివిధ శాఖల వద్ద పదవతరగతి, ఇంటర్‌మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థినుల జాబితా ఉందని, అలాగే బడి బయట ఉన్న పిల్లల జాబితా కూడా ఉందని అటువంటి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. బాల్య వివాహాలను నిరోధించడానికి విస్తృత ప్రచారం నిర్వహించి బాల,బాలికలకు వివాహం చేయబోమన్న హామీ పత్రాన్ని పొదుపు సంఘాల మహిళల నుంచి తీసుకోవాలని డీఆర్‌డీఏ, మెప్మా శాఖలను ఆదేశించారు.

బాల్య వివాహాల్లో పాల్గొన్నా నేరమే..

క్షేత్రస్థాయిలో బాల్య వివాహాలను అరికట్టడంపై అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, సచివాలయ కార్యదర్శులు దృష్టి సారించాలని చెప్పారు. బాల్య వివాహాలను చేయడమే కాకుండా, వాటిలో పాల్గొనడం కూడా నేరమన్నారు. వివాహం చేసే తల్లిదండ్రులు, పురోహితులు, ఫొటోగ్రాఫర్లు, కల్యాణ మంటపం నిర్వాహకులు తదితర అన్ని రకాల భాగస్వాములపై కేసు పెట్టడంతో పాటు వివాహంలో పాల్గొన్న బంధువులపైన బైండోవర్ కేసులు నమోదు చేయాలని చెప్పారు. వివాహం చేసే ముందు వారి వయసు ధ్రువీకరణ పత్రాన్ని తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రతి వివాహాన్ని తప్పనిసరిగా రిజిస్టర్ చేయాలని, రిజిస్టర్ అయిన వివాహాల వివరాలు ప్రతి వారం అందజేయాలని రిజిస్ట్రేషన్ అధికారులను ఆదేశించారు. ఈనెల 16న అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బాల్య వివాహాల నివారణపై పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. సమావేశంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి బి.శాంతకుమారి, ఆర్‌డీఓ సూర్యకళ, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములు నాయుడు, జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్, జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహం ధ్వంసం

- దుండగులను గాలిస్తున్న పోలీసులు



ధ్వంసమైన డాక్టర్ వైఎస్సార్ విగ్రహం



చించివేసిన స్వాగత ఫ్లెక్సీ

బొబ్బిలి: మండలంలోని మెట్టవలస గ్రామంలో గల దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. గురువారం రాత్రి పది గంటల వరకూ బాగానే ఉన్న విగ్రహం తెల్లారేసరికి ధ్వంసం కావడంతో వైస్ ఎంపీపీ అరసాడ శంకర రావు తదితరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైఎస్సార్ విగ్రహానికి చేయి, కాళ్ల భాగంలో దుండగులు విరగ్గొట్టారు. ఫిర్యాదు మేరకు సీఐ ఎం.నాగేశ్వర రావు, ఎస్సై జ్ఞాన ప్రసాద్ తమ సిబ్బందితో గ్రామానికి చేరుకుని విచారణ ప్రారంభించారు.

ఫ్లెక్సీ చించివేత

శుక్రవారం ఉదయం బొబ్బిలిలో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం జరగనున్న సందర్భంగా ముఖ్య అతిథులకు స్వాగతం పలుకుతూ మెట్టవలస అంతర్రాష్ట్ర రహదారిలో ఉన్న సచివాలయ సముదాయం వద్ద ఏర్పాటు చేసిన స్వాతగ ఫ్లెక్సీని కూడా దుండగులు చించివేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశానికి నాయకులు, కార్యకర్తలు వస్తున్న నేపథ్యంలో తెల్లారేసరికి ఫ్లెక్సీని చించేయడం, డాక్టర్ వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం వంటి దుశ్చర్యలను వైఎస్సార్‌సీపీ నాయకుడు శంబంగి వేణుగోపాల నాయుడు, మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ తమ్మిరెడ్డి దామోదర రావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఉత్తరావిల్లి అప్పలనాయుడు తదితరులు ఖండించారు. పోలీసులు త్వరగా దర్యాప్తు చేసి దోషులను పట్టుకుని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై ఐదుగురు పోలీసుల బృందం విచారణ చేస్తోందని సీఐ ఎం.నాగేశ్వర రావు విలేకరులకు తెలిపారు.

అమ్మ ఆర్పీలో..!

- డ్వాక్రా సంఘాల్లో రుణాల అవకతవకలపై సమగ్ర దర్యాప్తు
- రెండు జిల్లాల నుంచి పాల్గొన్న 36 మంది అధికారులు
- ప్రతి గ్రూపు నుంచి రూ.లక్షల్లో బయటపడిన అవకతవకలు



డ్వాక్రా సంఘాల లావాదేవీలపై దర్యాప్తు నిర్వహిస్తున్న అధికారులు

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి పొనుగుటివలస గ్రామంలో డ్వాక్రా సంఘాల మహిళలకు తెలియకుండా వారి ఖాతాల నుంచి నగదు డ్రా చేసి సొంతానికి వాడుకున్న ఆర్పీలపై సమగ్ర దర్యాప్తు శుక్రవారం నిర్వహించారు. మెప్మాపీడీ ఆదేశాల మేరకు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని బొబ్బిలి, విజయనగరం, నెల్లిమర్ల, సాలూరు, పార్వతీపురం, పాలకొండ నుంచి సీఓలు, సీఎల్ఆర్పీలు 27మంది, టీఎంసీలు ఐదుగురు, ఏఓ ఒకరు, ఐబీ, బీఎల్, ఎల్‌హెచ్‌లు ముగ్గురు చొప్పున మొత్తం 36 మంది అధికారులు దర్యాప్తులో పాల్గొన్నారు. వీరు చెరువు గట్టు, రామమందిరం, శివాలయం వద్ద మూడు బృందాలుగా దర్యాప్తు నిర్వహించారు. ఈ దర్యాప్తులో భాగంగా ఒక్కో గ్రూపును పరిశీలిస్తున్న సమయంలో లక్షల రూపాయల్లో సొమ్ము లావాదేవీలు జరగడాన్ని గుర్తించారు. ఈ మొత్తాన్ని సభ్యుల వద్ద ప్రస్తావించగా తమకు తెలియదని వారు చెప్పడంతో వారి నుంచి లిఖిత పూర్వకంగా దరఖాస్తు స్వీకరించారు. ఈ దర్యాప్తు రిపోర్టును టీఎంసీ ఎస్‌వీ రత్నంకు అందజేశారు. మహిళలంతా సహకరించడంతో సమగ్రంగా దర్యాప్తు పూర్తిచేశామని టీఎంసీ వెల్లడించారు.

విస్తుపోయిన అధికారులు

ఒక్కో గ్రూపును దర్యాప్తు చేస్తున్న సమయంలో రుణ లావాదేవీలు చూసి బృందం సభ్యులు విస్తుపోయారు. పొదుపు డబ్బులు లోన్లకు జమ చేయడం, కొన్ని చోట్ల ఇచ్చిన రుణాలకు తీర్మానాలకు పొంతనలేకపోవడం గుర్తించి అవాక్కయ్యారు. ఈ విషయంపై మహిళల వద్ద బృందం సభ్యులు ప్రస్తావించగా నగదు లావాదేవీలు మాకు తెలియవని, రుణాలు ఇచ్చిన దగ్గర నుంచి నెలవారీ వాయిదాలు కట్టే వరకు ఆర్పీలే చూస్తున్నారని వాపోయారు. ఆర్పీల వద్ద పుస్తకాలు ఉంచుకుని తమను ఏమార్చి రుణాలను తమ సంఘాల పేరిట వాడుకున్నారని మహిళలంతా ముక్తకంఠంతో దర్యాప్తు బృందం వద్ద గోడు వెళ్లబుచ్చారు. కూలి పనులు చేసుకుంటూ రుణాలు సక్రమంగా చెల్లించినప్పటికీ ఆర్పీలు నట్టేట ముంచారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విషయమై టీఎంసీ ఎస్‌వీ రత్నం వద్ద ప్రస్తావించగా గ్రూపుల అవకతవకలకు సంబంధించి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయించామని, ఆర్పీలు ఉమాదేవి, సంధ్యలు అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించామని, ఏ గ్రూపులో ఎంత మొత్తం రుణ లావాదేవీలు జరిగాయన్నది శనివారం వెల్లడించనున్నామని తెలిపారు.

ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య

- సూసైడ్‌లెటర్ స్వాధీనం చేసుకున్న పోలీసులు



ఆత్మహత్యకు పాల్పడిన పద్మజ

కొత్తవలస: మండల కేంద్రంలోని వసంత్ విహార్ కాలనీ సమీపంలో గల జీఎస్ఎన్ రాజునగర్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో శుక్రవారం ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనకు సంబంధించి మృతురాలి కుటుంబసభ్యులు, సీఐ వి.చంద్రశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయవాడ సమీపంలోని కొయ్యూరు మండలం, ముదునూరు గ్రామానికి చెందిన కె.రాజేష్‌చౌదరి వేపాడ మండలం సోంపురం సమీపంలో క్వారీని లీజ్‌కు తీసుకుని నడుపుతున్నాడు. భార్య పద్మజ, నాలుగు సంవత్సరాల కూతురు జస్వితాచౌదరి, తల్లిదండ్రులతో కలిసి జీఎస్ఎన్ రాజు నగర్‌లో అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నారు. శుక్రవారం ఉదయం రాజేష్ చౌదరి బ్యాంకు పని నిమిత్తం విశాఖలోని ఎన్ఏడీ కొత్త రోడ్డు వెళ్లగా అపార్ట్‌మెంట్‌లోని పై అంతస్తులో తెలిసిన వారింటికి రాజేష్ చౌదరి తల్లిదండ్రులు, కూతురు వెళ్లారు.

ఇంట్లో ఎవరూ లేని సమయంలో..

అదే సమయంలో రాజేష్ చౌదరి భార్య పద్మజ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. నాలుగేళ్ల కూతురు వచ్చి ఎంతసేపు తలుపు తట్టినా తీయకపోవడంతో పై అంతస్తులో ఉన్న నాన్నమ్మ, తాతయ్యల దగ్గరకు ఏడ్చుకుంటూ వెళ్లి చెప్పింది. దీంతో వారు వచ్చి తలుపు తట్టినా తీయకపోవడంతో విరగ్గొట్టి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కోడలు పద్మజ కనిపించడంతో హతాశులయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో డీఎస్పీ ఆర్.గోవింద రావు, సీఐ వి.చంద్రశేఖర్, ఎస్సై బొడ్డు దేవిలు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. విజయనగరం నుంచి వచ్చిన క్లూస్‌టీమ్ ఘటనా స్థలంలో వేలిముద్రలను, కొన్ని పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. 'నాకు బతకాలని లేదు. ఎంత ఆలోచించినా ప్రయోజనం లేకపోవడంతో చనిపోతున్నాను. నా చావుకు ఎవరూ బాధ్యులు కాదు. చిట్టితల్లీ జాగ్రత్త, గాడ్‌బ్లెస్‌యూ' అంటూ రాసిన సూసైడ్ లెటర్‌ను మృతదేహం పక్కన లభ్యం కావడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

నేడు పీఎం మత్స్య సంపద యోజన

పార్వతీపురం: మండలంలోని పెదబొండపల్లి తామర చెరువులో పీఎం మత్స్యసంపద యోజన పథకం కింద 20వేల చేపపిల్లలను విడిచిపెట్టే కార్యక్రమం స్థానిక శాసనసభ్యుడు అలజంగి జోగారావు ప్రారంభిస్తారని మత్స్యశాఖాధికారి వి.తిరుపతయ్య శుక్రవారం తెలిపారు. ఈ పథకం కింద జిల్లాలోని 110 చెరువుల్లో చేప పిల్లలను విడిచిపెట్టనున్నట్లు పేర్కొన్నారు. బీసీ సంఘాలకు 40శాతం, ఎస్సీ, ఎస్టీ సంఘాలకు 60శాతం సబ్సిడీతో చేపపిల్లలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 110 చెరువుల్లో రూ.16.98 లక్షల విలువగల 10.51 లక్షల చేప పిల్లలను విడిచిపెడతామన్నారు. అలాగే వెంగళరాయ సాగర్‌లో లబ్ధిదారుని వాటా 40శాతం కింద 3.96 లక్షల చేప పిల్లలను, తోటపల్లి రిజర్వాయర్‌లో 15లక్షల చేప పిల్లలను విడిచిపెట్టనున్నట్లు వివరించారు. మత్స్యకారులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రామతీర్థంలో సహస్ర దీపాలంకరణ



స్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో శుక్రవారం రాత్రి సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. వెండి మంటపంలో ఉన్న శ్రీ సీతా రామస్వామిని పల్లకిలో ఊరేగింపుగా దీపారాధన వేదిక వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక ఊయలలో ఆసీనులను చేశారు. అనంతరం సహస్ర దీపాలను వెలిగించి, స్వామికి ఊంజల్ సేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

కార్యక్రమాలను ఖరారు చేయండి..



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లా కేంద్రంలో ఈ నెల 29, 30, 31 తేదీల్లో నిర్వహించనున్న విజయనగరం ఉత్సవాల్లో భాగంగా చేపట్టనున్న కార్యక్రమాలకు ఆయా కమిటీలు త్వరగా తుదిరూపు ఇచ్చి ఖరారు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి. ఎస్ సూచించారు. ఉత్సవ నిర్వహణలో భాగంగా ఒక్కో వేదికలో నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి ఆయా కమిటీలతో శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా క్రీడా, వినోద, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ రకాల పోటీల నిర్వహణ, తదితర అంశాలపై జిల్లా అధికారులు, శాశ్వత సభ్యులతో చర్చించారు. గతేడాది కార్యక్రమాలు నిర్వహించిన అయోధ్య మైదానం, ఆనంద గజపతి ఆడిటోరియం, గురజాడ కళాభారతి, కోట, లయన్స్ కమ్యూనిటీ హాల్, రాజీవ్ స్టేడియం, సంగీత కళాశాల వేదికలతో పాటు ఈ ఏడాది అదనంగా మరికొన్ని వేదికల్లో ఉత్సవాల నిర్వహణకు ప్రతిపాదించారు. శ్రీమన్నార్ రాజగోపాల స్వామి ఆలయానికి బదులుగా లేడీస్ క్లబ్‌లో సాహిత్య వేదిక పేరుతో కవిసమ్మేళనం, సాహిత్యగోష్టి, అవధానం, పద్యపఠనం, వ్యాసరచన పోటీలు, ఆధునిక భువన విజయం వంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రతిపాదించారు. కోట సమీపంలో బొంకులదిబ్బ వద్ద ప్రఖ్యాత సురభి నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేసేందుకు ప్రాథమికంగా నిర్ణయించారు. ఆనందగజపతి ఆడిటోరియంనకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డీ అనిత, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి, మెప్మా పీడీ సుధాకర్, ఎస్‌డీసీలు సూర్యనారాయణ, వెంకటేశ్వరరావు, సీపీఓ బాలాజీ, డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి, ఉద్యాన శాఖ ఎ.డి జమదగ్ని, శాశ్వత సభ్యులు కాపు గంటి ప్రకాష్, డోల మన్మధకుమార్, బుచ్చిబాబు, రాధికారాణి, స్పార్క్ సొసైటీ పద్మనాభం, బాలు, తదితరులు పాల్గొన్నారు.

విజేతలై తిరిగి రావాలి

- రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు అండర్-17 జట్ల పయనం
- 7 నుంచి కడప జిల్లాలో జరగనున్న పోటీలు



కడప జిల్లాలో జరగనున్న అండర్-17 వాలీబాల్ పోటీలకు పయనమవుతున్న జిల్లా జట్లు



చిత్తూరు జిల్లా మదనపల్లెలో జరగనున్న అండర్-19 ఫుట్‌బాల్ పోటీలకు వెళ్తున్న జిల్లా జట్లు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ వాలీబాల్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్లు విజేతలుగా తిరిగి రావాలని అండర్-14,17 స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌వీ.రమణ ఆకాంక్షించారు. ఈనెల 7 తేదీ నుంచి కడప జిల్లాలో జరగనున్న అండర్-17 బాల,బాలికల స్కూల్ గేమ్స్ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్లు శుక్రవారం పయనమయ్యాయి. ఈ సందర్భంగా స్థానిక రైల్వేస్టేషన్‌కు చేరుకున్న జిల్లా జట్లను ఉద్దేశించి ఎల్‌వీ రమణ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడాప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తున్న జిల్లా బాలుర జట్టుకు కోచ్ అండ్ మేనేజర్‌లుగా కేవీఏఎన్ రాజు, శివున్నాయుడు, బాలికల జట్టుకు వైకుంఠం, రమణలు వ్యవహరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణంరాజు, గురునాయుడు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరులో ఫుట్‌బాల్ పోటీలకు పయనం

అండర్-19 స్కూల్‌గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాల, బాలికల ఫుట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్లు శుక్రవారం పయనమయ్యాయి. ఈనెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరిగే పోటీలకు జిల్లా నుంచి 18 మంది బాలురు, 18 మంది బాలికలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తున్న క్రీడాకారులకు స్థానిక రైల్వేస్టేషన్ వద్ద అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అండర్-19 జిల్లా ఖోఖో జట్ల ఎంపిక

- 28 నుంచి నంద్యాలలో రాష్ట్రస్థాయి పోటీలు



ఎంపిక పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా బాలికల జట్టు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-19 స్కూల్‌గేమ్స్ బాల, బాలికల ఖోఖో పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపికలు శుక్రవారం ముగిశాయి. అండర్-19 స్కూల్‌గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు ఇంటర్మీడియట్ విద్యనభ్యసిస్తున్న 19 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన క్రీడాకారులు 350 మంది హాజరయ్యారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 12 మంది బాలురు, 12 మంది బాలికలకు జిల్లా జట్టులో స్థానం కల్పించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 28 నుంచి నంద్యాలలో జరగనున్న అంతర్ జిల్లాల బాల, బాలికల ఖోఖో పోటీలకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లే క్రీడాకారులకు ప్రభుత్వమే రవాణా చార్జీలు భరిస్తుందని పేర్కొన్నారు. ఎంపిక పోటీలను పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు విక్రయించాలి

- వ్యవసాయ పరిశోధన స్థానం ఎ.డి జగన్నాథరావు



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న జగన్నాథరావు, తారకరామారావు తదితరులు

విజయనగరం ఫోర్ట్: రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ సంచాలకుడు డాక్టర్ పీవీకే జగన్నాథరావు పేర్కొన్నారు. స్థానిక కృషి భవన్‌లో డిప్లమో కోర్సు పూర్తి చేసిన డీలర్లకు శుక్రవారం ఆయన సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలామంది రైతులు ఎరువుల డీలర్లనే నేరుగా సంప్రదిస్తున్నారని, కావున పంటలను ఆశించే తెగుళ్లు, పురుగుల నివారణ చర్యలపై అవగాహన కలిగి ఉండాలని డీలర్లకు సూచించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా 30 శాతం, డీలర్ల ద్వారా 70 శాతం ఎరువులను ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. 48 వారాల పాటు డీలర్లు శిక్షణ పూర్తి చేసుకున్నారని, అన్ని పంటల యాజమాన్య పద్ధతులపై నిష్ణాతులైన శాస్త్రవేత్తలు డీలర్లకు శిక్షణ అందించారని తెలిపారు. అనంతరం పంటల యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్తలు రూపొందించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వి. తారకరామారావు, ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ కెల్ల లక్ష్మణ్, వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి నర్సుపల్లి అనూరాధ, శాస్త్రవేత్తలు తేజశ్వరరావు, స్వాతి, శ్రీనివాస్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చేపలు, రొయ్యల సాగుతో ఆర్థికాభివృద్ధి

- ముగిసిన మత్స్యకారుల శిక్షణ



మత్స్యకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నాక్సా ఉత్తరాంధ్ర రాష్ట్ర కోఆర్డినేటర్ ఎస్.మురళి, శ్రీకాకుళం జిల్లా ఫీల్డ్ మేనేజర్ రాము

తెర్లాం: మత్స్యకారులంతా చేపలు, రొయ్యలు సాగు చేసి ఆర్థికాభివృద్ధిని సాధించాలని నాక్సా(నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ ఆక్వాకల్చర్) ఉత్తరాంధ్ర రాష్ట్ర కోఆర్డినేటర్ ఎస్.మురళి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఈ నెల 4 నుంచి నాక్సా శ్రీకాకుళం జిల్లా ఫీల్డ్ మేనేజర్ పి.రాము ఆధ్వర్యంలో 'మంచి యాజమాన్య పద్ధతులు, విభిన్న జాతుల పెంపకం'పై మత్స్యకారులకు మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. ముగింపు కార్యక్రమానికి హాజరైన నాక్సా ఉత్తరాంధ్ర రాష్ట్ర కోఆర్డినేటర్ మాట్లాడుతూ మత్స్యకారులంతా చేపలు, రొయ్యల సాగులో మంచి యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు. మేలైన, విభిన్న జాతులకు చెందిన చేపలు, రొయ్యలు సాగు చేయడం ద్వారా మంచి ఆదాయాన్ని పొందవచ్చని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా ఆక్వా రంగాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తోందని, చేపలు, రొయ్యల సంఘాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఆర్థికంగా ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందే అవకాశం కలుగుతుందని తెలిపారు. నాక్సా శ్రీకాకుళం జిల్లా ఫీల్డ్ మేనేజర్ పి.రాము మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్టీ కులాలకు సంబంధించిన వారితో మత్స్యకార సంఘాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలు మత్స్యకారులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం శిక్షణ తరగతులకు హాజరైన 20మంది మత్స్యకారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎన్.పి చంద్రశేఖర్, తెర్లాం సర్పంచ్ బోనెల రూప, సచివాలయ ఫిషరీస్ అసిస్టెంట్లు శిరీష, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి రాగుల కొనుగోలు



సమాశంలో మాట్లాడుతున్న జేసీ గోవిందరావు

- ఆర్‌బీకేల్లో ఏర్పాటు కానున్న కేంద్రాలు

పార్వతీపురం: రాగుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ 2023-24 సీజన్‌కు సంబంధించి పార్వతీపురం మన్యం జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ మాదిరిగానే రైతులు పండించిన రాగుల పంటకూడా కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. ఈనెల 20నాటికి ఆర్‌బీకేల వద్ద ప్రభుత్వం రాగుల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాగులకు ప్రభుత్వం క్వింటాకు రూ.3,846ను మద్దతు ధర ప్రకటించిందని, వ్యవసాయశాఖ అంచనా మేరకు 936 మెట్రిక్ టన్నుల దిగుమతి వస్తుందని, అందులో 468 మెట్రిక్ టన్నులు కొనుగోలుకు వస్తాయని అంచనా వేశామన్నారు. జిల్లాలోని సీతంపేట, సాలూరు, పాచిపెంట, పార్వతీపురం, కొమరాడ, కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో 11 ఆర్‌బీకేల్లో రాగుల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు గుర్తించామన్నారు. రాగుల కొనుగోలులో ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే ఫోన్ 08963221003 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు. సమావేశంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి నాయక్ తదితరులు పాల్గొన్నారు.